సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 21 । జూన్ । 2023

ఆరోగ్య 'యోగ'ం
ఒత్తిడిని అధిగమించడంతో పాటు శారీరక ఆరోగ్యానికి యోగా జీవన విధానంలో భాగమవుతోంది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸



వాతావరణం
గరిష్టం/కనిష్టం
40.0/29.0
మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగనుంది. వడగాలులు వీస్తాయి. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆదిలాబాద్ బల్దియాకు గ్రీన్ సిటీ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: హరితహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి, పట్టణంలో పచ్చదనం పెంపునకు చేసిన కృషికి గాను ఆదిలాబాద్ బల్దియాకు గ్రీన్‌సిటీ అవార్డు లభించింది. రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కమిషనర్ ఏ.శైలజ ఈ అవార్డు స్వీకరించారు. వారిని మంత్రి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అధికారులు, సిబ్బంది కృషితో పాటు ప్రజల సహకారంతోనే అవార్డు దక్కినట్లు చైర్మన్ పేర్కొన్నారు.

దేద్ర జీపీకి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ భీంరావ్, కార్యదర్శి సాయికృష్ణ

బజార్‌హత్నూర్: హరితహారంలో భాగంగా మండలంలోని దేద్ర గ్రామపంచాయతీకి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు లభించినట్లు ఎంపీడీవో చౌహాన్ రాధ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ భీంరావ్, కార్యదర్శి సాయికృష్ణ అవార్డు అందుకున్నారు. పంచాయతీ పరిధిలో బృహత్ ప్రకృతివనం, ఇంకుడుగుంతలు, ఇంటింటికీ కిచెన్ గార్డెన్, రోడ్లకు ఇరువైపులా పచ్చదనం ఏర్పాటుతో ఈ అవార్డు వచ్చిందని తెలిపారు.

నేటి నుంచి ఉచిత శిక్షణ

ఆదిలాబాద్‌రూరల్: బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ద్వారా గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాలకు సంబంధించి బుధవారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు మూడు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. హాజరయ్యే అభ్యర్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్నాక్స్ అందించనున్నట్లు తెలిపారు.

దివ్యాంగులను విస్మరించడం సరికాదు



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ 22 రోజులుగా దివ్యాంగులు ఆందోళన చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు చేపట్టిన రిలే దీక్షకు మంగళవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. దివ్యాంగులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే రామన్న నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, అరుణ్‌కుమార్, షేక్ పాషా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డీటీసీ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు ఏ విధంగా జరుగుతాయి.. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను వివరించారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు శ్రీనివాస్, రామారావు, ఏఎంవీఐ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నార్నూర్ మండలం హీరాపూర్‌లో అడుగంటిన చేదబావి

పాతాళంలో గంగ

- పడిపోయిన భూగర్భజల మట్టం
- బోరుబావులపై కొరవడిన నియంత్రణ
- అప్రమత్తత లేకుంటే ముప్పే

కైలాస్‌నగర్: జిల్లాలో భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. గతేడాదితో పోల్చితే నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. నాలుగు నెలల వ్యవధిలో 9.93 మీటర్ల లోతుకు చేరడం ఆందోళనకు గురిచేస్తోంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, యాసంగి సాగుకు ఎక్కువ నీటిని వినియోగించడం, బోరుబావుల తవ్వకాలపై నియంత్రణ లేకపోవడం, జూన్ నెలాఖరుకు చేరినా వర్షాలు కురవకపోవడంతో జల మట్టం పాతాళానికి చేరువవుతోంది. నీటి వినియోగంపై అప్రమత్తత లేకుంటే ముప్పు తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా బోరుబావుల తవ్వకం

జిల్లాలో బోరుబావుల తవ్వకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. కొందరు వాల్టా నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించేస్తున్నారు. నిబంధనల ప్రకారం బోరుబావి ఏర్పాటుకు రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. అలాగే బోరుకు బోరుకు మధ్య 250 మీటర్ల దూరం ఉండాల్సి ఉండాలి. అయితే జిల్లాలో ఈ నిబంధనలు ఏవీ అమలుకు నోచుకోవడం లేదు. కనీసం పది మీటర్ల దూరంలోనే రెండు, మూడేసి బోర్లు ఉండడం గమనార్హం. వీటిని నియంత్రించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ×మామూలు×గా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అలాగే ప్రభుత్వం 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తుండటంతో వ్యవసాయ క్షేత్రాల్లో నీటి వినియోగం గణనీయంగా పెరిగింది. యాసంగిలో సాగు చేసిన పంటలకు బోరుబావులే ఆధారం కావడంతో జలాల వినియోగం అధికమై లోతుకు చేరడానికి ప్రధాన కారణమవుతుంది.

జిల్లాలో భూగర్భజల సరాసరి నీటి మట్టం వివరాలు (మీటర్లలో)

నెల	2022–23	2023–24	వ్యత్యాసం
ఫిబ్రవరి	3.73	8	4.27
మార్చి	4.43	8.92	4.55
ఏప్రిల్	4.84	9.93	5.09
మే	05	8.86	3.86

ఇచ్చోడలో అట్టడుగుకు..

ఈ ఏడాది మే నెలలో నమోదైన అధికారిక నీటి మట్టం వివరాలు పరిశీలిస్తే.. ఇచ్చోడలో అత్యధికంగా 25.70 మీటర్లకు పడిపోయింది. అలాగే గుడిహత్నూర్‌లో 18.2 మీటర్లు, జైనథ్‌లో 14.85 మీటర్లు, నేరడిగొండలో 9.90 మీటర్ల లోతుకు చేరాయి. ఈ మండలాల్లో ఏప్రిల్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇచ్చోడలో ఏకంగా 37.60 మీటర్లకు చేరడం గమనార్హం. అయితే మేలో కురిసిన అకాల వర్షాలతో నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. జిల్లాలోని మిగతా మండలాల్లోనూ ఏడు మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి.

అప్రమత్తత అవసరం

నీటి వినియోగంలో ప్రజలు అప్రమత్తత పాటించకుంటే ముప్పు తప్పదని అధికారులు సూచిస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలి. వర్షపు నీటిని సంరక్షించేలా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలి. వ్యవసాయ క్షేత్రాల్లోనైతే నీటి కుంటలు నిర్మించుకోవాలి. చెక్ డ్యాంల నిర్మాణం ద్వారా కూడా నీటిని సంరక్షించుకున్న వారమవుతాము. ఎక్కువ నీటి వినియోగం ఉన్న పంటలను కాకుండా డ్రిప్, తుంపర్ల సేద్యం ద్వారా సాగయ్యే పంటలపై దృష్టిసారిస్తే నీటి సంరక్షణ సాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



జిల్లాలో భూగర్భ జల మట్టం రోజురోజుకు పడిపోతున్నందున నీటిని పొదుపుగా వాడుకోవాలి. లేకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బోరుబావుల తవ్వకాలు నిబంధనల మేరకు చేపట్టాలి. ముందుగా మీ సేవ ద్వారా రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. వారు పరిశీలించి అనుమతించాకే బోరు ఏర్పాటు చేసుకోవాలి.

– ఏ.శ్రీవల్లి, భూగర్భ జలవనరుల శాఖ ఏడీ

ఆశ చూపి.. కాజేస్తూ!



రిమ్స్ ఆస్పత్రి



బాధితుడితో అక్రమార్కుడు చేసిన వాట్సాప్ చాటింగ్

- రైల్వేశాఖలో కొలువుల ఆశ చూపి ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళ రెండు రోజుల క్రితం పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. పది మంది నుంచి రూ.49.40 లక్షలు వసూలు చేసిన క్షిలేడి×ని బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కటకటాల్లోకి పంపారు.
- ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో టెక్నికల్ టీచర్లు, అటెండర్ల నియామకం చేపట్టింది. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన కొంతమంది నుంచి రూ.2 లక్షల నుంచి 3 లక్షలు వసూలు చేసి వారిని సర్కారు బడులకు పంపించింది. అయితే విద్యాశాఖ నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేకపోవడంతో విషయం బయటపడింది. వెంటనే ఆ నియామకాలు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆ ప్రైవేట్ సంస్థ బోర్డు తిప్పేసింది.
- నేరడిగొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ మోసగాడు ఆ కళాశాలకు అతడితో పాటు మరికొంత మంది లెక్చరర్లను కలిసి గ్రూప్–4 ఉద్యోగం కావాలా.. రూ.8లక్షలు అవుతుందని చెప్పాడు. మొదట రూ.2లక్షలు ఇవ్వాలని, పరీక్ష తర్వాత మరికొంత, ఉద్యోగం వచ్చిన తర్వాత మిగతా డబ్బులు ఇవ్వాలని నమ్మబలికాడు. వారి ఫోన్ నంబర్లు తీసుకున్నాడు. తన నంబర్ మాత్రం వారికి ఇవ్వలేదు. తాను మళ్లీ కలుస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఇలా జిల్లాలో నిరుద్యోగులకు టోకరా వేసేందుకు అక్రమార్కులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు.

- ఉద్యోగాల పేరిట మరో మోసం
- తాజాగా రిమ్స్‌లో అక్రమార్కుడి బాగోతం
- ఔట్‌సోర్సింగ్ జాబ్ పేరిట రూ.1.50 లక్షలు వసూలు
- జిల్లాలో తవ్వినకొద్దీ అక్రమాలు

ఆదిలాబాద్‌టౌన్: అమాయకుల ఆశలను ఆసరాగా చేసుకుంటున్న కొంతమంది మోసగాళ్ల ఆగడాలు జిల్లాలో పెరిగిపోతున్నాయి. మాయమాటలతో నమ్మిస్తూ నిరుద్యోగులకు గాలం వేస్తున్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు తమకు పరిచయం ఉన్నారని, మీరు కోరుకున్న చోట ఉద్యోగం కల్పిస్తామంటూ ఆశ చూపుతున్నారు. డబ్బులు చేతిలో పడగానే ముఖం చాటేస్తున్నారు. జిల్లాలో ఇటీవల ఇలాంటి సంఘటనలు పెరిగి పోయాయి. ముఖ్యంగా రిమ్స్ ఇటీవల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి గా ఏర్పడటం, అలాగే రిమ్స్ ఆస్పత్రిలోఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఉన్నాయంటూ కొందరు మోసాలకు తెరలేపారు. విద్యార్హత, ఇంటర్వ్యూ లేకుండా నేరుగా కొలువు ఇప్పిస్తామని పేర్కొంటూ అందినకాడికి దండుకుంటున్నారు. విద్యావంతులైన యువకులు సైతం వీరి వలలో చిక్కుకుంటున్నారు. డబ్బులు పోయాక లబోదిబోమంటున్నారు. తాజాగా రిమ్స్‌లో ఓ అక్రమార్కుడి బాగోతం బయటపడింది.

రిమ్స్‌లో అక్రమార్కుడు..

ఆస్పత్రిలోని పాథాలజీ విభాగంలో పనిచేసే ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఓ నిరుద్యోగి నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ భారీగా దండుకున్నాడు. బాధితుడి భార్య సైతం రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తుంది. ఓ ఏజెన్సీ ద్వారా ఉద్యోగం పెట్టిస్తానని గత ఆగస్టులో ఆమెను నమ్మబలికాడు. భర్త ఖాళీగా ఉన్నాడని, ఉద్యోగం ఇప్పించాలని వేడుకోగా ఇదే అదునుగా భావించి ఆమె వద్ద నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. 15రోజులు, నెల.. రేపుమాపు అంటూ తిప్పుకుంటున్నాడు. ఆమె ఎవరికి చెప్పుకోలేక కన్నీరుమున్నీరైంది. ఆమెకు కూడా చాలీచాలని వేతనం. అప్పు చేసి భర్త ఉద్యోగం కోసం డబ్బులు చెల్లించింది. అటు ఉద్యోగం రాకపోవడం, ఇటు చేసిన అప్పు తీర్చే మార్గం లేక బాధితురాలు మనోవేదనకు గురవుతోంది. ఆ శాఖ ఉద్యోగులతో చర్చించుకోవడంతో విషయం బయటపడింది. రిమ్స్ డైరెక్టర్‌ను ఆశ్రయిస్తానని ఆమె చెప్పడంతో ఒక్క రూపాయి కూడా తిరిగి ఇచ్చేదిలేదని కేటుగాడు భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితుడితో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణ, మెసేజ్‌లు వారు ఫోన్‌లో భద్రపర్చడం గమనార్హం. అధికారులు ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి. మరోవైపు రిమ్స్‌లో ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మోసగాళ్ల మాటలు నమ్మొద్దు

రిమ్స్ ఆస్పత్రిలో గాని సూపర్ స్పెషాలిటీలో గాని ఎలాంటి ఉద్యోగాలు ఖాళీగా లేవు. ఏవైనా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటే ముందుగానే నోటిఫికేషన్ ఇస్తాం. నిరుద్యోగులు దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దు. ఉద్యోగం కోసం ఎవరికి డబ్బులు ఇవ్వొద్దు. బాధితులెవరైన ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు

- జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్
- ఘనంగా విద్యా దినోత్సవం

కైలాస్‌నగర్: మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విద్యాదినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో మన ఊరు –మనబడి, మన బస్తి– మన బడి× కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యుదీకరణ, డైనింగ్ హాల్, గ్రీన్ బోర్డులు, ఫర్నిచర్, డిజిటల్ విద్య వంటి వసతులతో ఆధునికీకరిచినట్లుగా వెల్లడించారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్ అందించే పాఠశాలలు దేవాలయాలతో సమానమన్నారు. ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులు, ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసి జ్ఞాపికలతో సత్కరించారు. అలాగే ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.



ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరిచాయి. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీఈవో ప్రణీత, డీఐఈవో రవీందర్, జిల్లా బీసీ సక్షేమాధికారి రాజలింగు, జెడ్పీటీసీ సుధాకర్, సెక్టోరియల్ అధికారులు నారాయణ, నర్సయ్య, ఉదయశ్రీ, ఎంఈఓ జయశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

నార్నూర్: ప్రభుత్వం సర్కారు బడులను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుంజాల పాఠశాలలో రూ.3.80 లక్షలతో ప్రహరీతో పాటు మరమ్మతు పనులు పూర్తి చేయగా వాటిని మంగళవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలతో పాటు రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొతుబాయి, సర్పంచ్ సావిత్రిబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ చందన్ బాయి, ప్రధానోపాధ్యాయుడు రామారావు చౌహాన్, దిలీప్ తదితరులున్నారు.



చాందా(టి)లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న



బోథ్‌లో కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

బంగారిగూడ, చాందా(టి)లో..

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మండలంలోని బంగారిగూడ, చాందా (టి) ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యా దినోత్సవం నిర్వహించారు. చాందా(టి)లో నూతనంగా నిర్మించిన తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. సమాజంలో విద్యతోనే గుర్తింపు ఉంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీఈవో ప్రణీత, ఎంపీపీ రమేశ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, ఎంఈవో జయశీల, తదితరులు పాల్గొన్నారు.

సైద్‌పూర్‌లో..

బేల: మండలంలోని సైద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమలో భాగంగా నిర్మించిన నూతన తరగతి గదులను ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మనోహర్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, సర్పంచ్ సుమన్‌బాయి, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోథ్‌లో కేజీబీవీ భవనం ప్రారంభం

బోథ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో రూ.2.05 కోట్లతో నిర్మించిన కేజీబీవీ భవనాన్ని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం కేజీబీవీలు, గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాహెర్ బిన్ సలాం,ఆత్మ చైర్మన్ సుభాష్ తదితరులున్నారు.

క్రీడా స్ఫూర్తి నింపేందుకే ఒలింపిక్ డే రన్

ఆదిలాబాద్: క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి నింపేందుకే ఒలింపిక్ డే రన్ అని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఒలింపిక్ డే పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద మంగళవారం క్రీడా రన్ ఏర్పాటు చేశారు. ఏఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆయన క్రీడాజ్యోతి వెలిగించి రన్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ఒలింపిక్ డే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, యూనిస్ అక్బాని, క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు



రన్‌ను ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు

ఆధ్యాత్మిక దినోత్సవం విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో బుధవారం నిర్వహించే ఆధ్యాత్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని భారత బౌద్ధమహాసభ అధ్యక్షుడు శాలిక్‌రావు, నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్ కోరారు. జిల్లా కేంద్రంలోని బుద్ధవిహార్‌లో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా బీఆర్ అంబేద్కర్, బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అంతకుముందు జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బుద్ధ విహార్‌లో ఉదయం 9గంటలకు నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో సమతా సైనిక్‌దల్ అధ్యక్షుడు దయానంద్ కాంబ్లే, మహిళ నాయకురాళ్లు రమాబాయి, శోభాబాయి, అరుణబాయి, అనితబాయి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దళిత నాయకులు

నేడు పలు ఆలయాల్లో పూజలు..

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ నవీన్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగంగా జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్వాడి ధర్మశాలలో ఉదయం 9 గంటలకు వేదపారాయణం, 10 గంటలకు సుదర్శన హోమం, సాయంత్రం 6:30 గంటలకు భజన కార్యక్రమం ఉంటాయని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

మొబైల్ షాపులో చోరీ

• రూ.లక్షా 80వేల ఫోన్లు అపహరణ



మొబైల్ షాపు రేకులు పగలగొట్టిన దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. ఎప్పుడు రద్దీగా ఉండే అంబేద్కర్ చౌక్ ప్రాంతంలోని ఓ మొబైల్ షాప్‌కు కన్నం పెట్టారు. షాపులోని కొత్త ఫోన్‌లతో పాటు రిపేర్ కోసం వచ్చిన ఫోన్‌లను సైతం ఎత్తుకెళ్లారు. దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితుడి వివరాల ప్రకారం.. పట్టణంలోని గణేష్ థియేటర్ సమీపంలోని ఆపిల్ మొబైల్ షాపులో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రూ.1.60 లక్షల విలువ గల 12 కొత్త మొబైల్ ఫోన్‌లతో పాటు రూ.20వేల విలువ గల వినియోగదారుల ఆరు సెల్‌ఫోన్‌లు అపహరణకు గురైనట్లు ఆ షాపు యజమాని అబ్దుల్ జాహిద్ తెలిపారు. దుండగులు దుకాణంపైన గల రేకులను తొలగించి లోనికి చొరబడ్డారు. రెండేళ్ల క్రితం సైతం ఇదేవిధంగా షాపులో చోరీ జరిగింది. ఘటన స్థలానికి ఫోరెన్సిక్, పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

రిమ్స్‌లో రిమాండ్ ఖైదీ మృతి



మహేశ్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నిర్మల్ జైలు సూపరింటెండెంట్ చిరంజీవి వివరాల ప్రకారం... కుభీర్ మండలంలోని దార్‌కుబీర్‌కు చెందిన బంక మహేశ్ (30) ఈ నెల 13న కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చాడు. అన్నదమ్ముళ్ల మధ్య భూతగాదాల మధ్య హత్యాయత్నానికి పాల్పడడంతో 307 సెక్షన్ కింద జైలుకు తరలించారు. అదే రోజు రాత్రి అనారోగ్యం బారిన పడడంతో నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నెల 16వ తేదీ వరకు అక్కడే చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ నెల 17 నుంచి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు.

ఆస్పత్రిలో గుర్తు తెలియని యువకుడు



రిమ్స్‌లో గుర్తు తెలియని యువకుడు

నేరడిగొండ: మండలంలోని బందంరేగడి అటవీ ప్రాంతంలో స్పృహ కోల్పోయిన ఓ గుర్తు తెలియని యువకుడు సోమవారం పశువుల కాపరులకు కనిపించాడు. వారు పోలీసులను సంప్రదించడంతో నేరడిగొండ ఎస్సై సాయన్న అక్కడికి చేరుకొని ఆ యువకుడిని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి పంపించారు. సదరు యువకుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, సంబంధికులు ఎవరైన ఉంటే నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో సెల్ నం.8712 659947పై సంప్రదించాలని పేర్కొన్నారు.

18ఏళ్లుగా ఆరోగ్యంగా ఉన్న..



2006 నుంచి యోగా సాధన చేస్తున్నాను. ఈ 18 ఏళ్లలో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఒత్తిడికి దూరంగా ఉంటున్న. గతంలో ఆదిలాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తలలో రక్తం గడ్డ కట్టిందని డాక్టర్లు చెప్పారు. అప్పుడు రాందేవ్ బాబా స్ఫూర్తితో యోగాను అలవాటు చేసుకున్నాను. అనంతరం గడ్డకట్టిన రక్తం క్రమంగా సాధారణ స్థితికి వచ్చిందని డాక్టర్లు తెలిపారు. అప్పటినుండి మరింత ఉత్సాహంగా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాను. నిర్మల్ జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాల ఆవరణలో రోజు ఉదయం రెండు గంటల పాటు యోగాలో శిక్షణ ఇస్తున్నాను.

– జంగిలి బాలాజీ యాదవ్, యోగా శిక్షకులు, (హెడ్ కానిస్టేబుల్), నిర్మల్

యోగా సాధనతో ఒత్తిడి దూరం..



విధి నిర్వహణలో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు బిజీ షెడ్యూల్ లో ఉండడం మూలంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యేవాడిని. డాక్టర్లను సంప్రదించగా ఉదయం సాయంత్రం రెండు పూటలు టాబ్లెట్లను వాడమన్నారు. అయితే తెలిసిన మిత్రులు యోగా సాధన చేయమని సలహానివ్వగా, గత పది నెలలుగా జిల్లా కేంద్రంలో ప్రతిరోజు ఉదయం యోగా సాధన చేస్తున్నాను. ఒత్తిడి పూర్తిగా తగ్గింది. – కొండారి కిరణ్ కుమార్, ప్రైవేటు ఉద్యోగి, నిర్మల్

నిత్య జీవితంలో భాగం కావాలి...



నేను పదేళ్లుగా యోగా సాధన చేస్తున్న. ప్రస్తుతం నా వయసు 60కి దగ్గరగా ఉంది. ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నానంటే మంచి ఆరోగ్య అలవాట్లు, యోగా సాధన ద్వారానే. పలు మానసిక, ఆరోగ్య సమస్యలకు పరిష్కారం యోగా ద్వారా లభిస్తుంది. ఒత్తిడితో కూడిన ప్రస్తుత జీవన విధానంలో ఉదయం ఒక గంట యోగాకు కేటాయించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి.

– వట్టోలి ముత్యం, యోగా సాధకులు, ఎంఈవో (మామడ, కుంటాల), నిర్మల్

ఆరోగ్య 'యోగ'ం



మామడ: నిర్మల్ జిల్లా కేంద్రంలో యోగా నేర్చుకుంటున్న మహిళలు

భావన, యోగా క్రీడాకారిణి, కడెం

ఒత్తిడిని అధిగమించడానికి, శారీరక ఆరోగ్యానికి కాపాడుకోవడానికి ప్రపంచం మొత్తం యోగాను తమ జీవన విధానంలో భాగంగా చేసుకుంటోంది. మనిషి మానసిక, శారీరక, ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తోంది. కాబట్టే ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను పాటిస్తున్నాయి. అలాంటి యోగాను ప్రపంచానికి పరిచయం చేసింది భారతదేశం. 2015 నుంచి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. నేడు 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. – నిర్మల్‌ఖిల్లా

• ఒత్తిడి, డిప్రెషన్ దూరం.. • ఏకాగ్రత, దృఢచిత్తానికి తరుణోపాయం.. • ఆరోగ్య సమస్యలకు అద్భుత పరిష్కారం • నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం..

యోగాలో మేటి.. అంబారిపేట్

కడెం: మండలంలోని అంబారిపేట్ జిల్లా పరిషత్ పాఠశాల యోగాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాఠశాల పీఈటీ షేక్ ఇమ్రాన్ ప్రత్యేక చొరవతో 2015 నుంచి ఇక్కడి విద్యార్థులు యోగాసనాలు నేర్చుకుంటున్నారు. ఏడేళ్లుగా పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో, 50 మంది విద్యార్థులు జిల్లా స్థాయి యోగా పోటీల్లో రాణించారు. యోగా గురువు షేక్ ఇమ్రాన్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నారు.

సిల్వర్ మెడల్ సాధించా



పీఈటీ ఇమ్రాన్ సార్ అంబారిపేట్ పాఠశాలలో యోగాలో మాకు ఇచ్చిన శిక్షణతో నాలుగు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ప్రస్తుతం నేను డిగ్రీ చదువుతున్న. 2018లో రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించాను. ఇటీవలే ప్రభుత్వం నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా యోగాసనాలు నేర్పించాను.

-సుకన్య, రాష్ట్రస్థాయి క్రీడాకారిణి


జాతీయ స్థాయి పోటీలకు కోచ్‌గా..



2015 నుంచి అంబారిపేట్ ప్రభుత్వ పాఠశాల పీఈటీగా విధులు నిర్వహిస్తున్న. 2016, 2018లో జాతీయ స్థాయి యోగా పోటీలకు తెలంగాణ రాష్ట్ర కోచ్‌గా, మూడుసార్లు యోగా పోటీలకు రాష్ట్ర పరిశీలకులుగా వ్యవహరించాను. ప్రతీ రోజు విద్యార్థులతో వార్మప్ ఎక్సర్‌సైజ్‌లు, ధ్యానం చేయించి యోగాసనాలు ప్రారంభిస్తాం.

-షేక్ ఇమ్రాన్, పీఈటీ,

ఔరా.. అనిపించే ఆసనాలు



భార్గవ్

తలమడుగు: మండలంలోని అర్లీకే గ్రామానికి చెందిన బోండ్ల వెంకటస్వామి కవిత దంపతుల కుమారుడు భార్గవ్ యోగా ఆసనాలలో ప్రతిభ కనబర్చుస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని బాలాజీ విద్య మందిర్‌లో 7వ తరగతిలో యోగా శిక్షణ తీసుకున్నాడు. అప్పటినుంచి జిల్లా స్థాయి పోటీలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నాడు.

యోగాతోనే ఆరోగ్యం



మామడ: నాకు రోడ్డు ప్రమాదంలో కాలుకు, తలకు బలమైన దెబ్బ తగిలింది. తలలోని నరాలకు శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. యోగాతో ఫలితం ఉంటుందని తెలుసుకుని యోగాను ప్రారంభించాను. యోగా చేయడంతో ఎలాంటి శస్త్రచికిత్స లేకుండానే ఆరోగ్యం బాగుపడింది. యోగాను ప్రతి రోజు చేయడంతో పాటు పలువురికి యోగాను నేర్పిస్తున్నాను.


– బాలాజీ, యోగా శిక్షకుడు, నిర్మల్

ఒత్తిడి దూరమవుతుంది..



మామడ: ప్రతి రోజు యోగా చేయడంతో మంచి ఆరోగ్యం లభిస్తుంది. నిత్యం బిజీగా ఉండే వారు ఒత్తిడిని జయించి ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. యోగాపై శిబిరాలను నిర్వహించి అవగాహన కల్పించాం. రోజు అరగంట యోగాకు కేటాయిస్తే చిన్నచిన్న రుగ్మతలకు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. – సంధ్యారాణి, ఆయుష్ వైద్యురాలు

సర్వరోగ నివారిణి..



ఆదిలాబాద్: ప్రస్తుత ఆధునిక జీవన శైలి, ఒత్తిడి కారణంగా ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం యోగా సాధన చేయడంతో వీటి నుంచి ఉపశమనం పొందవచ్చు. మనస్సు, వాక్కు, కర్మలను నియంత్రించుకోవడంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పొందేందుకు యోగా దోహదపడుతుంది. – తిరుపతిరెడ్డి, యోగా శిక్షకుడు, ఆదిలాబాద్

మూడుసార్లు గోల్డ్ మెడల్...



రవీందర్

భైంసాటౌన్: ఉప్పు రవీందర్ యోగాలో శిక్షణ పొందడమే కాకుండా యోగా కోర్సు పీజీ డిప్లొమా పూర్తి చేశాడు. పదేళ్లుగా భైంసాతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యోగా శిక్షకుడిగా పనిచేస్తున్నాడు. ఇప్పటివరకు మూడుసార్లు జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించాడు. స్థానికంగా విద్యార్థులు, పిల్లలకు యోగాలో శిక్షణ ఇస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.

విదేశాల్లో మనోళ్ల యోగా పాఠాలు



సింగపూర్‌లో శిక్షణ ఇస్తున్న కృష్ణకుమార్

భైంసాటౌన్: ఇలేగాం గ్రామానికి చెందిన కృష్ణకుమార్ యోగాలో శిక్షణ పొంది ఏకంగా సింగపూర్, ఇండోనేషియాతో పాటు ఇతర దేశాల్లో యోగా పాఠాలు చెబుతున్నారు. భార్య జీవితతో కలిసి శిక్షణ అందిస్తున్నాడు. 2012లో బెంగళూరులోని వ్యాస యూనివర్సిటీలో యోగాలో ఎంఎస్సీ, డిప్లొమా చేశాడు. 2016 వరకు ఢిల్లీలో మోదీ గ్రూప్ ఆఫ్ కంపెనీసలో యోగా శిక్షకుడిగా చేయగా అక్కడి నుంచి టర్కీ వెళ్లి యోగా తరగతులు నిర్వహించాడు. 2015లో చెన్నైకి చెందిన జీవితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇండోనేషియాలోని ఇండియన్ ఎంబసీలో జీవితకు యోగా, కల్చరల్ టీచర్‌గా ఉద్యోగం రావడంతో రెండేళ్లు అక్కడే పని చేశాడు. 2108లో సింగపూర్‌కు వెళ్లి నాలుగేళ్లు.. సింగపూర్ ప్రభుత్వం నుంచి ఉత్తమ శిక్షకుడిగా సైతం అవార్డు సైతం అందుకున్నాడు.

యోగాకు కేరాఫ్ ఇలేగాం..!



యోగా శిక్షణ ఇస్తున్న సీహెచ్ వీరన్న

భైంసాటౌన్: యోగా.. కేరాఫ్ ఇలేగాం అంటే అతిశయోక్తి కాదనిపిస్తోంది. ఈ గ్రామం నుంచి యువకులు యోగాలో శిక్షణ పొందడమే కాకుండా యోగానే ఉపాధిగా మార్చుకున్నారు. ఒకరు విదేశాల్లో సైతం యోగా తరగతులు నిర్వహిస్తుండగా, మరొకరు హైదరాబాద్‌లో సొంతంగా యోగా ఇనిస్టిట్యూట్ నెలకొల్పి తరగతులు నిర్వహిస్తున్నారు. మిగిలినవారు స్థానికంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, చిన్నారులకు శిక్షణ ఇవ్వడమేకాక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. వీరందరికీ స్ఫూర్తి గ్రామానికే చెందిన యోగా గురువులు మతీన్, పోతన్న. వీరు గ్రామంలో దాదాపు 30మందికి యోగా శిక్షణ ఇవ్వగా వారిలో ఐదుగురు యోగా ద్వారానే ఉపాధి పొందుతున్నారు.



సింగపూర్‌లో యోగా తరగతులు నిర్వహిస్తున్న కృష్ణకుమార్

వ్యవసాయం, యోగా...



రాష్ట్రస్థాయి పతకాలు సాధించిన విద్యార్థులతో శిక్షకుడు మల్లేశ్

మల్లేశ్ ఓ వైపు కుటుంబ పోషణ కోసం వ్యవసాయం చేస్తూనే మరోవైపు యోగా శిక్షణతోనూ ఉపాధి పొందుతున్నాడు. గ్రామానికి చెందిన యోగా గురువు మతీన్ నుంచి స్ఫూర్తి పొందాడు. మల్లేశ్ హైదరాబాద్‌లో యోగా కోర్సులో డిప్లొమా పూర్తి చేసుకుని కొన్నేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహిస్తూ, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా శిక్షణ అందిస్తున్నాడు. మల్లేశ్ సైతం ఇప్పటి వరకు మూడుసార్లు జాతీయ స్థాయిలో పతకాలు సాధించాడు.

అన్నదమ్ములిద్దరూ...





సీహెచ్ గంగాధర్

యోగా సాధన చేస్తున్న వీరన్న

సీహెచ్ గంగాధర్, వీరన్నలు అన్నాదమ్ములు. 2001 నుంచి ఇద్దరూ యోగా సాధన చేస్తున్నారు. వీరన్న బెంగళూరులోని వ్యాస యూనివర్సిటీలో యోగా థెరపీలో ఎంఎస్సీ చేయగా గంగాధర్ తమిళనాడులో కోర్సు చేశాడు. వీరన్న పదేళ్లుగా హైదరాబాద్‌లో స్థిరపడి అక్కడే ప్రణవ అథ పేరిట యోగా ఇనిస్టిట్యూట్ నెలకొల్పి శిక్షణ ఇస్తున్నాడు. గతంలో ప్రముఖ టీవీ యాంకర్ సుమకు సైతం యోగా తరగతులు చెప్పినట్లు వీరన్న తెలిపారు. గంగాధర్ వద్ద శిక్షణ తీసుకున్న నిజామాబాద్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించారు.

ట్రిపుల్‌ఐటీలో విద్యా దినోత్సవం



మాట్లాడుతున్న సెక్రటరీ మారుపాక నగేశ్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ విద్యావిధానం, అకాడమిక్ పరంగా తీసుకున్న నిర్ణయాలు, చర్యలు, బాసర క్యాంపస్‌లో సాధించిన విజయాలు, విద్యార్థుల పాత్ర, అధ్యాపకులు ఉద్యోగుల పాత్రపై ఆయన వెల్లడించారు. అనంతరం టీఎస్ కాస్ట్ సెక్రటరీ మారుపాక నగేశ్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ, టీఎస్ కాస్ట్ మధ్య అవగాహన ఒప్పందం జరిగిందని, రానున్న రోజుల్లో ఇక్కడి విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు ట్రావెల్స్ సీజ్

• పరిమితికి మించి ప్రయాణికులను తరలించడంతో..



ఆదిలాబాద్: అల్పాహారాన్ని వడ్డిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న మూడు ట్రావెల్స్‌లను రవాణ శాఖాధికారులు సోమవారం అర్ధరాత్రి సీజ్ చేశారు. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఆర్టీసీ బస్టాండ్‌లో దింపారు. హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు కార్మికులను తీసుకెళ్తున్నారు. ఒక్కో బస్సులో 30వరకు పరిమితి ఉండగా వంద మంది వరకు ప్రయాణికులను తరలిస్తున్నారు. ఈ క్రమంలో తనిఖీలు చేపట్టిన రవాణ శాఖాధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆ ట్రావెల్స్‌లను సీజ్ చేసి ఆర్టీసీ డిపోలో ఉంచారు. అందులో ప్రయాణిస్తున్న వారిని బస్టాండ్‌లో దింపడంతో వారు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం రవాణ శాఖాధికారులు ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా వారికి భోజనం ఏర్పాటు చేయించారు. వీరిని ఛత్తీస్‌ఘడ్‌కు తరలించేందుకు ఆ బస్సుల యజమానుల నుంచి డబ్బులు రాబట్టి రెండు ఆర్టీసీ బస్సుల ద్వారా వారి గమ్యస్థానాలకు చేర్చేవిధంగా చర్యలు చేపట్టారు. మిగిలిన మరికొంత మంది కోసం మరో బస్సును ఏర్పాటు చేస్తామని డీటీసీ పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. ఇదిలా ఉండగా రెండుమూడు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు వెళ్తున్న రెండు బస్సులను సీజ్ చేసిన విషయం తెలిసిందే.

ఆదిలాబాద్: ప్రయాణికుల సౌకర్యం కోసం అల్పాహారం పంపిణీ చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్ఎం జానీ రెడ్డి, డీటీసీ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న మూడు ప్రైవేటు ట్రావెల్స్‌లను సోమవారం సీజ్ చేశారు. ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో బస్సులను నిలుపగా, ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోనే నిరీక్షించాల్సిన పరిస్థితి. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాస్, డీఎం కల్పన పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: ప్రేమ పేరుతో బాలికను లొంగదీసుకొని మోసం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ సైదరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్లు బాధిత కుటుంబీకులు ఈ నెల 5న మావల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాలికను మోసం చేసిన ప్రవీణ్‌ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులతో సరస్వతి పూజ

భైంసా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బాసర ఆలయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరస్వతీ పూజ చేయించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో ప్రతి రోజు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలను బాసర ఆలయానికి పిలిపించారు. విద్యార్థులందరితో సరస్వతి పూజ చేయించారు.